కంటిపై కునుకుంటే ఒట్టు..

- పవర్‌కట్‌తో ప్రజల వెతలు
- తీవ్ర స్థాయికి చేరిన వేసవి ఉష్ణోగ్రతలు
- తరచూ కోతలతో నానా అవస్థలు

కొత్తపేట: అసలే వేసవి కాలం.. ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరాయి. ఉదయం నుంచే ఉక్కబోత ప్రారంభమై క్రమేపీ ఎండ తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరో పక్క తరుచూ విద్యుత్ అనధికార కోతలు, సాంకేతిక అంతరాయాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈఎల్‌ఆర్, విద్యుత్ సాంకేతిక సమస్యలతో పాటు వివిధ కారణాలతో కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. రాత్రిళ్లు కూడా వివిధ కారణాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రం కొత్తపేటలోనే కరెంట్ సరఫరా సక్రమంగా ఉండటం లేదంటే ఇక నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి రోజు పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పలువురు వినియోగదారులు వాపోయారు.

ప్రతిపాదనలు పంపినా పట్టలేదు

కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా పెరిగిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కృషి మేరకు ఒక 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దాంతో అప్పట్లో అన్ని కేటగిరీలకు విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయి. తరువాత అన్ని కేటగిరీల సర్వీసులు పెరగడంతో రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా మరో 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు గత ఏడాది ప్రారంభంలో అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే ఎలక్షన్ నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రతిపాదన మరుగున పడిపోయింది. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, గత ప్రభుత్వంలో ప్రతిపాదనను పట్టించుకోకపోవడంతో 8 ఎంవీఏ మంజూరుకు నోచుకోలేదు. 5 ఎంవీఏపై ఓవర్ లోడ్ పడి సబ్ స్టేషన్ పరిధిలోని బ్రేకర్స్ తరచూ ట్రిప్ అయిపోతున్నాయి. ఫలితంగా పవర్ లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నా.. పాలకులకు ఏ మాత్రం పట్టడం లేదని పలువురు వినియోగదారులు వాపోయారు. గత కొన్ని రోజులుగా విద్యుత్ సమస్యలపై స్పందించి నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.



కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్

ఏబీ స్విచ్‌లు వాంటింగ్

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ (ఎయిర్ బ్రేక్) స్విచ్‌లు లేకపోవడం వలన కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ సమస్య ఏర్పడినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్ ఆఫ్ చేసి సమస్య పరిష్కరిస్తారు. అయితే ఏబీ స్విచ్ లేకపోవడం వలన సబ్ స్టేషన్ వద్ద లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం

రాత్రి పూట కూడా అప్రకటిత విద్యుత్ కోత, సాంకేతిక సమస్యలతో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వేసవి కావడంతో ఉక్కబోతతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రతి రోజు ఒక సమయమంటూ లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అలాగే కరెంటు ఎప్పుడు వస్తుందో అని స్థానిక అధికారులను సంప్రదించినా స్పష్టమైన సమాచారం ఇచ్చే పరిస్థితి లేదు.

పలు ట్రాన్స్‌ఫార్మర్ల సాంకేతిక సమస్యలు, విద్యుత్ లైన్లపై చెట్ల ఆకులు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే పలువురు సంబంధిత సిబ్బంది సకాలంలో స్పందించకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు వినియోగదారులు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎక్కడైనా సమస్య ఏర్పడితే వెంటనే స్పందించి పరిష్కరించడం ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు.

కోతలతో అవస్థలు



తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండటంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. కరెంటు పోతే ఎక్కువ సమయం రావడం లేదు. రాత్రిళ్లు కూడా కోతలు ఉండటంతో దోమల బెడదతో అల్లాడిపోతున్నాం. కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఉండదో తెలియని పరిస్థితి. విద్యుత్ కోతలను నివారించాలి. సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కరించాలి.

– ఎస్.కృష్ణ, కొత్తపేట

8 ఎంవీఏ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



గత కొన్ని రోజులుగా రాత్రీ, పగలు అనే తేడా లేకుండా ఎక్కువ సమయం విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికి కారణం విద్యుత్ వినియోగానికి అనుగుణంగా కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ లేకపోవడమేనని అంటున్నారు. అందువల్ల వెంటనే 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ఈలోపు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

– మార్గన గంగాధరరావు, ఎంపీపీ, కొత్తపేట

విద్యుత్ సరఫరాకు చర్యలు



వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిన దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగింది. సబ్ స్టేషన్‌లో ఎంవీఏ పీటీఆర్‌లపై లోడు పెరిగి ట్రిప్ అవడం వంటి సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించడం ద్వారా పవర్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరం మేరకు లోడును రావులపాలెం మండలం ఈతకోట సబ్ స్టేషన్‌కు డైవర్ట్ చేస్తున్నాం. ఏనుగులమహల్‌లో మరో సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ఏబీ స్విచ్‌లు కొరత లేదు. అవసరం మేరకు సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటాం.

– డి.చిట్టిరాజు, ఈడీఈ, కొత్తపేట

క్లుప్తంగా

సమగ్ర విచారణ జరిపించాలి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజా సంఘాల బృందం

మలికిపురం: సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన దళిత యువకుడు గంటా సునీల్ మరణం అనుమానాస్పద మృతిగా పరిగణించి సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని రాజోలు నియోజకవర్గ పరిరక్షణ సమితి అధ్యక్ష కార్యదర్శులు నల్లి ప్రసాదరావు, మంద సత్యనారాయణ, దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, బీఎస్పీ జిల్లా కార్యదర్శి బూసి జాన్ మోసే తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, నిజ నిర్ధారణ చేసిన బృందం ఈ మేరకు డిమాండ్ చేశారు. గంటా సునీల్ సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మలికిపురం పోలీసులను కోరామని ముత్యాల శ్రీనివాస్ తెలిపారు.

నేడు కోకో రైతుల సమావేశం

అంబాజీపేట: కోకో గింజల ధరల విషయమై అంబాజీపేట కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ కోకో రైతు సంఘ సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్ తెలిపారు. బీకేఎస్ అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, జిల్లా కోకో రైతు సంఘ అధ్యక్షుడు ఉప్పుగంటి భాస్కరరావుల ఆధ్వర్యంలో కోకో రైతుల అత్యవసర సమావేశం నిర్వహించనున్నామన్నారు. కోకో రేటు విషయమై రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోరాటంపై చర్చ, సంఘ బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్నామన్నారు. అత్యవసర సమావేశానికి కోకో రైతులంతా పాల్గొనాలని కోరారు.

వైభవంగా మాణిక్యాలమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: గెద్దాడ గ్రామంలో కొలువైన గ్రామ దేవత మాణిక్యాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. విశేష సంఖ్యలో హాజరైన భక్తులు మాణిక్యాలమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అంగరంగ వైభవంగా నిర్వహించి అమ్మవారి జాతర అన్న సమారాధనతో సంపూర్ణమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకురాలు పాముల రాజేశ్వరీదేవి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారు ప్రతి ఒక్కరిపై కరుణ చూపి, అందరినీ చల్లగా చూడాలని అభిలషించారు. ఆమె వెంట స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు రావులమ్మ జాతర



కె.పెదపూడిలో కొలువుదీరిన రావులమ్మ

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారి జాతరలో భాగంగా ప్రత్యేక పూజలను గత నాలుగు రోజులు నుంచి అమ్మవారికి ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించనున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



కొత్తపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని పూలమాల వేస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: స్థానిక బాబానగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాబానగర్ పెద్దలు, విగ్రహ నిర్మాణ, ఆవిష్కరణ కమిటీ, జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారితో పాటు పలువురు నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, జనసేన నాయకుడు పల్లికొండ సుధీర్‌కుమార్, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్ల వెంకటరమణ దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు..



బి.దొడ్డవరంలో సరి చేసిన ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి ఇంపాక్ట్

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని పాటురేవు పక్కన సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒరిగిపోయింది. చేతికి అందే ఎత్తులో ఉన్న ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఒరిగిపోయిన కరెంటు స్తంభాన్ని సరిచేసి చేతికి అందనంత ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎంతో కాలం నుంచి ఈ సమస్య పెండింగ్‌లో ఉందని ఎట్టకేలకు 'సాక్షి' చొరవతో సమస్యను పరిష్కరించారని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా ఆర్‌అండ్‌బీ వంతెన



శిథిలస్థితికి చేరిన ఆర్‌అండ్‌బీ వంతెన

మామిడికుదురు: దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్‌అండ్ బీ వంతెన పూర్తిగా శిథిలస్థితికి చేరి ప్రమాదకరంగా మారింది. పెదపట్నంలంక-బి.దొడ్డవరం గ్రామాల సరిహద్దులో పాటురేవుపై నిర్మించిన వంతెనపై ప్రయాణం క్షణక్షణం.. భయం భయంగా మారింది. ఈ వంతెన రెయిలింగ్స్ విరిగిపోయాయి. వంతెన శ్లాబ్ పెచ్చులు ఊడిపోతూ ప్రమాదకర పరిస్థితిని సూచిస్తోంది. ఏటా గోదావరి వరదలకు ఇక్కడ వరద ప్రవాహం తీవ్రంగా ఉంటుంది. దీనిపై పాలకులు, అధికారులు దృష్టి సారించి దీని పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రైతుబజార్‌కు ప్రతి బుధవారం సెలవు

అమలాపురం టౌన్: అమలాపురం రైతు బజార్‌కు తొలి నుంచి ప్రతి మంగళవారం సెలవు దినం అమలవుతూ ఆ రోజు బజార్ మూతపడేది. బజార్‌లో దుకాణాలు నిర్వహించే రైతులు, వ్యాపారులు తమకు మంగళవారం కాకుండా బుధవారం సెలవు ఇవ్వాలని ఇటీవల జిల్లా మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ విశాలాక్షిని కోరారు. తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి బుధవారం రైతుబజార్‌కు సెలవు అమలవుతుందని ఆ బజార్ ఇన్‌చార్జి గోకరకొండ సుబ్బారావు తెలిపారు.

తైక్వాండోకు పెరుగుతున్న ఆదరణ



అంబాజీపేటలో తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందేందుకు ఇటీవల కాలంలో తైక్వాండోపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. అంబాజీపేట, ముంగండ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణ శిబిరంలో సుమారుగా 200 మంది క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. బాలికలు అధికంగా పాల్గొని శిక్షణ పొందుతున్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దృఢత్వానికే కాకుండా ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో ఉపయోగమనే లక్ష్యంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక హైస్కూల్‌లో తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, పితాని లక్ష్మీభార్గవి పర్యవేక్షణలో సుమారు 20 ఏళ్లుగా తైక్వాండో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన 30 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలోను, 150 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఉన్నారు. బ్లాక్ బెల్ట్ పొందిన క్రీడాకారులు 30 మంది, నేషనల్ రిఫరీలుగా విధులు నిర్వహిస్తున్న వారు 9 మంది ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులను సైతం తైక్వాండో వైపే వారి తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. వేసవి శిక్షణ పూర్తయిన అనంతరం కూడా శిక్షణ తరగతులను ఉదయం 6 గంటల నుంచి నిర్వహిస్తామని త్రిమూర్తులు తెలిపారు.

గౌతమ బుద్ధుని జీవితం ఆదర్శం



ఆదుర్రులో బౌద్ధ స్తూపం వద్ద బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొన్న భిక్షువులు

మామిడికుదురు: భగవాన్ గౌతమ బుద్ధుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బౌద్ధ భిక్షువులు నాగభూషణం, సంఘపాల పేర్కొన్నారు. ఆదుర్రు ప్రాచీన ఆది బౌద్ధ స్తూపం వద్ద ఆదివారం బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బౌద్ధ స్తూపం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బౌద్ధ స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బౌద్ధ భిక్షువులు నాగభూషణం, సంఘపాల మాట్లాడుతూ బౌద్ధమతం మానవ జీవితానికి జ్ఞానం, శాంతిని ప్రబోధించిందన్నారు. మానవులు కరుణతో జీవించే ఆత్మ విశ్వాసాన్ని అందిస్తుందన్నారు. ఆత్మ విశ్వాసం, కరుణ, సామాజిక సామరస్యం వంటి బోధనలు బౌద్ధమతం నుంచే ఆవిర్భవించాయని చెప్పారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ ట్రస్టు అధ్యక్షుడు చింతా శ్రీరామమూర్తి, కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, బత్తుల జనార్దనరావు, బయ్యా మోహన్, తాడి సురేష్, పులపర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటు అభినందనీయం



ఆస్పత్రిలో ఐసీయూను ప్రారంభిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, గొల్లపల్లి తదితరులు

రావులపాలెం: అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో గ్రామీణ ప్రాంతమైన రావులపాలెంలో ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంబీ ఆస్పత్రి వారి ఏఎస్ఎల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)ని జగ్గిరెడ్డి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జగ్గిరెడ్డిని, మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావులను ఎంబీ ఆస్పత్రి అధినేత మేడపాటి సత్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బొక్కా వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు డాక్టర్లు సందీప్, అనూష, ఇతర వైద్య సిబ్బందిని అభినందించారు.

కుంగ్‌ఫూ విద్యార్థుల తిరంగా ర్యాలీ



కొత్తూరు సెంటర్‌లో ప్లకార్డులు చేతపట్టి తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కుంగ్‌ఫూ విద్యార్థులు



మలికిపురంలో తిరంగా యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



రావులపాలెంలో కూటమి నాయకులు, శ్రేణులు నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు సెంటర్‌లో కుంగ్‌ఫూ, కరాటే విద్యార్థులు ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. మదర్‌థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ టి.అబ్బులు ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద నిర్మూలన కోసం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికులు చూపిన ధైర్య సాహసాలను, విజయగాథలను ప్లకార్డుల రూపంలో వివరించారు. ఫౌండర్ అబ్బులు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈనెల మే ఏడున భారత్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిందన్నారు. పాకిస్తాన్‌లోని తొమ్మిది కీలక ఉగ్ర స్థావరాలపై భారత్ మెరుపుదాడులు నిర్వహించి ఉగ్రవాదులను మట్టుబెట్టిన విధానాన్ని ఆయన గుర్తు చేశారు. భారత ఆయుధ సంపత్తి చూసి ఇప్పుడే ప్రపంచ దేశాలు షాక్ అయ్యాయని, ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీయ సాంకేతికతతో సత్తా చాటిందని కొనియాడారు. కోచ్ టి.లక్ష్మి, సందీప్ కిరణ్, ఎం.సత్యకాంత్, ఎం.మోషే, జి.ప్రసాద్, కె.సింహాద్రి పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: దేశ భద్రతను కాపాడేందుకు త్రివిధ దళాల చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకల ఆట కట్టించిన సాయుధ దళాల త్యాగాలకు గౌరవ సూచికగా ఆదివారం మలికిపురంలో తిరంగా యాత్ర జరిగింది. మలికిపురం వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమై ప్రధాన రహదారుల వెంబడి సాగింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వేమా, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, చాగంటి స్వామి, మాతే శ్రీనివాస్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో భారత సైనిక దళాలకు సంఘీభావంగా ఆదివారం రావులపాలెంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయం నుంచి కళా వెంకట్రావు సెంటర్ వరకూ ఈ ర్యాలీ నిర్వహించి, కోనసీమ ముఖద్వారం వద్ద మానవహారం నిర్వహించారు. ర్యాలీలో భారత మాతాకు జై భారత్ సైనికులకు జై అంటూ నినాదాలు చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాథూర్, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి, ఆకుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మాజీ సైనికులను దుశ్శాలువాలతో సత్కరించారు.

విద్యా వ్యవస్థలో అసంబద్ధ విధానాలు

మలికిపురం: విద్యా విధానంలో ప్రస్తుతం అమలు చేస్తున్న అసంబద్ధ విధానాలను ఖండిస్తూ పీఆర్టీయూ మలికిపురం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 117 జీవో వలన పాఠశాలల్లో అనేక అసమానతలు ఏర్పడ్డాయి. దీనిని నివారిస్తూ ప్రస్తుత పాలకులు జీవో నెంబర్ 19, 20, 21 విడుదల చేశారని పేర్కొంటూ ఈ పై జీవో వలన కూడా ప్రస్తుత పాఠశాలలో 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని వీటిలో కూడా ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి వేరువేరుగా ఉందని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఇది పూర్తిగా అసంబద్ధంగా ఉందన్నారు. సెకండరీ టీచర్లకు రావలసిన ఎల్ఎఫ్ఎల్ ప్రధాన ఉపాధ్యాయుల ప్రమోషన్లను మిగులు స్కూలు అసిస్టెంట్లకు కేటాయించడం విరుద్ధం అన్నారు. ప్రతి హైస్కూల్‌లో 1:53 నిష్పత్తి కాకుండా 1:45 నిష్పత్తితో మిగులు స్కూల్ అసిస్టెంట్ హైస్కూల్, యూపీ పాఠశాలలో సర్దుబాటు చేయాలన్నారు. ప్రతి హైస్కూల్‌లో ఇంగ్లీష్ మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియం తరగతులు కూడా ఏర్పాటు చేయాలి. పలు డిమాండ్లను నెరవేర్చాలని పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పారి రామకృష్ణ, నీలా రావు, కూర్మా గణేష్, యేపుగంటి వెంకట పద్మనాభం, కె.సువర్ణరాజు, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి శతాబ్ది మహోత్సవాలు



సీతారామచంద్రస్వామి ఆలయ శతాబ్ది మహోత్సవాల సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో సీతారామచంద్రస్వామివారి శతాబ్ది మహోత్సవాలు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వైఖానస ఆగమ శాస్త్ర మహదాచార్య ఆగమ విద్యానిధి వాడపర్రుకు చెందిన సుందర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. మహాసుదర్శన, అష్టోత్తర శత కలశాభిషేక, శ్రీలక్ష్మీనారాయణ, శ్రీరామ నామయజ్ఞ మహోత్సవం నిర్వహించారు. దివ్య వైఖానస భగవత్ శాస్త్ర ఆగమ విధానం ప్రకారం పాంచాహ్నిక దీక్షా పూర్వకంగా నిర్వహించారు. 1925లో ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరుణ, దీక్షా ధారణ, అకల్మష హోమం, ప్రసాద వితరణ, వల్మీక మృత్తికా సంగ్రహణం, యాగశాల ప్రవేశం, యాగ మందిర పూజ, నవ కుంభారాధన, అంకురార్పణ, వాస్తు పూజ, షట్కుండ ప్రణయనం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు శుద్ధి, యాగశాల ప్రధానహోమం, వర్షవర్ధన దైవత్య హోమం వంటి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు రోజుల పాటు ఈ పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తాటిముంజెలా మజాకా?



తాటికాయల నుంచి తీసిన ముంజెలు

అంబాజీపేట: వేసవి తాపాన్ని నివారించే తాటి ముంజెలకు మంచి గిరాకీ పలుకుతోంది. డిమాండ్ ఉన్న ఈ తాటి ముంజెలు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. పల్లెల్లో తాటి చెట్లను ఇబ్బడిముబ్బడిగా నరికివేస్తుండడంతో తాటి ముంజెలకు తీవ్ర కొరత ఏర్పడింది. వేసవి తాపాన్ని తట్టుకోవడంతో పాటు మంచి పోషక విలువలు కలిగిన తాటి ముంజెలు రైతులు, యువకులకు లాభసాటి వ్యాపారంగా మారింది. ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వరకు పల్లెల్లోని తాటి ముంజెలను తీసి వాటిని దూరంగా పట్టణాలు, నగరాలకు తీసుకువెళ్లి అమ్ముతున్నారు. ఒక్కో యువకుడు తన మోటారు సైకిల్‌పై రూ.3,500 విలువైన ముంజెలను తీసుకుని వెళ్లి మధ్యాహ్నానికి విక్రయించి ఇళ్లకు చేరుతున్నామని రాములయ్య తెలిపారు. డజన్ తాటి ముంజెలు రూ.25 పలుకుతుంది. రవాణా చార్జీలు, తాటి ముంజెలు తీసుకునేందుకు ఖర్చులు పోగా రోజుకు రూ.1,000 వరకు సంపాదిస్తున్నామని యువకులు తెలిపారు.

పోషక విలువలు ఎన్నో..

తాడిచెట్టును ఇంగ్లిష్‌లో పల్మైరాట్రీ అని శాస్త్రీయంగా బోరాసస్ ఫ్లాబెలీఫెర్ అని పిలుస్తారు. తాడిచెట్టులో అన్ని భాగాలు ఉపయోగపడతాయి. వీటి నుంచి తీసే ముంజెలను వేసవి తాపం తీర్చేందుకు విరివిగా ఉపయోగిస్తున్నారు. 100 గ్రాముల ముంజెలను తీసుకుంటే వాటిలో 92.5 గ్రాముల తేమ, 0.6 గ్రాముల ప్రొటీన్‌లు, 0.1 గ్రాముల కొవ్వు, 0.2 గ్రాముల బూడిద, 0.2 గ్రాముల పీచుపదార్థాలు, 6.4 గ్రాముల కార్బోహైడ్రేడ్స్, 12 మిల్లీగ్రాముల కాల్షియం, 21 మిల్లీగ్రాముల ఫాస్ఫరస్, 0.3 మిల్లీ గ్రాముల ఇనుప ధాతువు, 61 మిల్లీ గ్రాముల ఆస్కార్బిక్ ఆమ్లం ఉంటాయని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.